పేదల సంక్షేమానికి నిరంతరం కృషి

రెండోరోజు కొనసాగిన 'ప్రజాపాలన' దరఖాస్తుల స్వీకరణ



అభయహస్తం పతకానికి దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

నాగోలు: ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు పేదలు దరఖాస్తు చేసుకోవాలని కొత్తపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగాల కిషోర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం కొత్తపేట డివిజన్ ఆర్టీసీ కాలనీ సంక్షేమ భవన్, రాజీవ్‌గాంధీనగర్‌లో లో నిర్వహించిన ప్రజా పాలనను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం చేపట్టిన దరఖాస్తులను పంపిణీ చేశారు. నాయకులు ఎండీ షరీఫ్, కాలనీవాసులు యాదగిరి పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్: ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన కార్యక్రమం ఆయా కేంద్రాల వద్ద ప్రజల నుంచి అనుహ్య స్పందన వస్తోంది. రెండో రోజున అన్ని కేంద్రాల వద్ద సరైన దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచామని నిర్వాహకులు తెలిపారు.

ప్రత్యేక కౌంటర్లు..

దరఖాస్తు ఫారాలను సమర్పించేందుకు మహిళలు, పురుషులకు వేర్వేరుగా కౌంటర్లను ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని, రద్దీని నియంత్రించేందుకు బారికేడ్లు ఏర్పాటు చేసి క్యూ పద్ధతిన కేంద్రాలకు పంపుతున్నట్లు పేర్కొన్నారు. తమకు తప్పకుండా ఏదో ఒక పథకం వస్తుందని నమ్మకం ఉందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలో..

మలక్‌పేట: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఇందిరానగర్, మూసారంబాగ్ రజక సంఘం భవన్, జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలో ప్రజాపాలన అభయహస్తం ఆరు గ్యారంటీ దరఖాస్తు స్వీకరణ సెంటర్లను సందర్శించారు. ప్రజాపాలన సెంటర్ వద్ద దరఖాస్తులు ఉచితంగా లభిస్తాయని, డబ్బులు చెల్లించి ఎవరూ బయట కొనుగోలు చేయొద్దని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ దావూద్ అహ్మద్, గుండప్ప, శ్రీనివాస్, మురళీ, నవీన్, కృష్ణ తదితరులున్నారు.

ప్రతి కుటుంబానికి అండగా ఉంటాం..

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్ర అభివృద్ధి కోసం 6 గ్యారంటీ పథకాలను అమలు చేస్తూ.. ప్రజాపాలన కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుడుతూ.. దరఖాస్తులు స్వీకరించి ప్రతి కుటుంబానికి అండగా ఉంటుందని ఆ పార్టీ పీసీసీ మెంబర్, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, రాష్ట్ర యువజన నాయకులు చిలక ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కృష్ణానగర్ వార్డు కార్యాలయం-సౌభాగ్యపురం కాలనీ సంక్షేమ భవనం-పార్క్, మార్గదర్శికాలనీ సంక్షేమ సంఘ భవనం -హరిపురీ కాలనీ కమిటీ హాల్ (పార్క్)లలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన గ్యారంటీల పథకాల దరఖాస్తు స్వీకరణ కార్యక్రమంలో కేంద్రాలను దేప భాస్కర్‌రెడ్డి ఇతర నాయకులు పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ అధికారులతో సమీక్షించి లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చూసుకోవాలన్నారు. నూతన కేంద్రాలను కూడా ఏర్పాటు చేయాలని తెలిపారు. రాష్ట్ర ఎస్సీసెల్ కన్వీనర్ బండి మధుసూదన్‌రావు రాష్ట్ర నాయకులు తల్లాటి రమేష్ నేత, శివ, కల్యాణ్‌యాదవ్, పొట్టబతిని నగేష్, సంగం రమేష్, రఘు, మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, రేణుక, జయశ్రీ, సంతోష, మమత, రమాదేవి, స్వరూప, కవిత, మాధవి, లావణ్య, రాజునాయక్, అక్రమ్, సలీం, ప్రేమ్‌నాయక్, భాస్కర్ నాయక్, పింటు, శ్రీధర్, జహంగీర్, శ్రీకాంత్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన' దరఖాస్తు కేంద్రాల పరిశీలన

ఎల్‌బీనగర్: ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌బీనగర్ డీసీ రవీందర్, కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి అన్నారు. రెండోరోజు ప్రజాపాలన దరఖాస్తులను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల పత్రాలను బయట కొనుగోలు చేయొద్దని సూచించారు. అవసరమైన దరఖాస్తులను ఆయా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచామన్నారు. దరఖాస్తులను నింపేందుకు వచ్చే వారికి ఆయా కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించామని పేర్కొన్నారు. వార్డు ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌గౌడ్, వీఓ యాదగిరి, నాయకులు కామేష్, చిన్నయాదవ్, కౌశిక్, భార్గవ్ తదితరులున్నారు.

దరఖాస్తు కేంద్రాల పరిశీలన..

ఎల్‌బీనగర్: ప్రభుత్వం ఆమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌బీనగర్ జోనల్ ప్రత్యేక అధికారి, ట్రాన్స్‌పోర్టు కమిషనర్ జ్యోతిబుద్ధప్రకాశ్ అన్నారు. శుక్రవారం ఆయన జోనల్ పరిధిలోని నాగోలు వార్డు కార్యాలయం, మన్సురాబాద్ వార్డు కార్యాలయం వద్ద ప్రజల నుంచి సేకరిస్తున్న ప్రజాపాలన దరఖాస్తులను ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ, ఎల్‌బీనగర్ సర్కిల్-3 ప్రత్యేక అధికారి కులకర్ణిలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దరఖాస్తు ఫారాలు ఎలా నింపాలో అక్కడి అధికారులను సంప్రదించాలన్నారు. కేంద్రాలకు వచ్చిన వారిని ఆయన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ఈ దరఖాస్తులను తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ దరఖాస్తులను పారదర్శకంగా లబ్ధిదారులకు కావాల్సిన పథకాలను ఎంచుకున్న వారందరికీ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్రాల వద్ద లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు లోటుపాట్లను సవరించాలని సూచించారు. ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ రవీందర్‌కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రెండోరోజు 7594 దరఖాస్తులు..

చాదర్‌ఘాట్: ప్రజాపాలనలో రెండోరోజు మలక్‌పేట సర్కిల్-6లో అభయహస్తం పథకానికి 7594 దరఖాస్తులు వచ్చాయని సర్కిల్-6 డీసీ జయంత్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. అభయ హస్తం దరఖాస్తులే కాకుండా ఇతర సమస్యల పైన 794 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. మొదటిరోజున 7102 అభయ హస్తం దరఖాస్తులు రాగా.. 477 ఇతర సమస్యలపై దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇంటింటికీ తిరిగి 16260 ఫారాలను పంపిణీ చేశామని పేర్కొన్నారు.



దరఖాస్తులను అందజేస్తున్న కాంగ్రెస్ నేత దేప భాస్కర్‌రెడ్డి



దరఖాస్తు తీసుకుంటున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్



ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలించిన డీసీ రవీందర్



నాగోలు వార్డు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ట్రాన్స్‌పోర్టు కమిషనర్ తదితరులు

రైతు బజార్లో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారుల్లో కూరగాయల ధరలు (కిలో రూపాయల్లో) టమాట రూ.21, వంకాయ 45, బెండకాయ 45, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ 55, బీరకాయ 45, క్యాబేజీ రూ.15, ఫ్రెంచిబీన్స్ రూ.45, క్యారెట్ 35, దొండకాయ రూ.35-58, చిక్కుడు రూ.28-65, గోకరకాయ రూ.50, బీట్‌రూట్ రూ.28, క్యాప్సికం రూ.75, ఆలుగడ్డ 23, దోసకాయ రూ.23, సొరకాయ రూ.15, పొట్లకాయ 18, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 50గా ఉన్నాయి. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

సంక్రాంతి కవితల పోటీలకు ఆహ్వానం

సైదాబాద్: తెలుగు ప్రజలు సంతోషంగా నిర్వహించుకునే సంక్రాంతి పండుగ సందర్భంగా వైఎస్ఆర్ మూర్తి చారిటబుల్ ట్రస్ట్, హ్యాపీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ వైఎస్ఆర్‌మూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన ఐఎస్ సదన్ సమావేశంలో వివరాలను వెల్లడించారు. 15 నుంచి 75 ఏళ్లున్న వారు తాము స్వయంగా రాసిన కవితలను 18 పంక్తుల్లో తమకు పంపాలని తెలిపారు. ఆసక్తి ఉన్న కవులు తమ కవితలను జనవరి 4లోగా సెల్ నెం 9849569626కు పంపాలన్నారు. జనవరి 7న నిర్వహించే వేడుకల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. అదేరోజు పోటీల్లో పాల్గొన్న కవులందరినీ సత్కరిస్తామని వివరించారు.

4న లూయిస్ బ్రెయిలీ ఉత్సవాలు

చాదర్‌ఘాట్: అంధుల ఆరాధ్య దైవమైన లూయిస్ బ్రెయిలీ జయంత్యుత్సవాలు జనవరి 4న మలక్‌పేట వికలాంగుల సంక్షేమ భవనంలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వికలాంగుల సంక్షేమశాఖ కార్యాలయం అధికారులు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు హాజరవుతున్నట్లు సమాచారం.

నిరంతర కృషితోనే లక్ష్య సాధన



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట: ఏకాగ్రతతో కూడిన నిరంతర సాధనతోనే ఎంచుకున్న లక్ష్యం సులభంగా దక్కుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నేపాల్ దేశంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి టార్కెట్ బాల్ పోటీల్లో చంపాపేటకు చెందిన లాస్య, శరత్‌కళ్యాణ్‌లు గోల్డ్, సిల్వర్ పతకాలు దక్కించుకున్నారు. శుక్రవారం ఆయన ఎల్‌బీనగర్‌లో విజేతలను అభినందించి పతకాలను ధరింపజేశారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు సుంకోజు కృష్ణమాచారి, నిశికాంత్‌రెడ్డి, కోచ్ ఉమాశంకర్ తదితరులున్నారు.

ఆలయ నూతన కమిటీ

నాగోలు: డివిజన్ పరిధిలోని బండ్లగూడ అయ్యప్పకాలనీలోని శ్రీ సంజీవ ఆంజనేయస్వామి ఆలయ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. దేవాలయ చైర్మన్‌గా లక్ష్మీజగదీశ్వరి, వైస్‌చైర్మన్లుగా జగదీష్, నర్సింహచారి, రవివర్మ, ప్రధాన కార్యదర్శిగా రవికాంత్‌శర్మ, సీనియర్ సలహాదారులుగా సతీష్, సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్‌గుప్తా, గోపాల్, ఎల్లేష్, నరేష్, యాదయ్య, జ్యోతిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు దేవాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: అభివృద్ధి పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించి పనులను ఇంజినీరింగ్ అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్‌లో రూ.30 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. కాలనీలలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు. తీగల అమర్నాథ్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మమతా, మల్లేష్‌గౌడ్, రాంచందర్‌నాయక్ తదితరులున్నారు.

అయోధ్య అక్షింతల వితరణ



కొత్తపేట వితరణ కార్యక్రమంలో కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: శతాబ్దాల రామమందిర నిర్మాణకార్యంలో అందరూ.. భాగస్వామ్యం కావాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య రామమందిరంలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా అయోధ్య నుంచి వచ్చిన అక్షింతల వితరణ కార్యక్రమం శుక్రవారం మోహన్‌నగర్‌లోని వేంకటేశ్వర ఆలయానికి తీసుకురాగా.. కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 22న జరిగే శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్టలో ప్రత్యక్షంగా పాల్గొన లేకున్నా.. సాయంత్రం ప్రతీ ఇంట్లో దీపాలు వెలిగించి ఊరు- వాడల్లో ఆధ్యాత్మిక శోభను తీసుకురావాలన్నారు. కొత్తపేటలో ఇంటింటికీ తిరిగి అయోధ్య శ్రీరాముని అక్షింతలు పంపిణీ చేశారు.

మహిళ అదృశ్యం



ఆదమ్మ (ఫైల్)

మలక్‌పేట: ఓ మహిళ అదృశ్యమైన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణస్వామి, భార్య ఆదమ్మ (42), కుమారుడితో కలిసి సలీంనగర్‌లో నివాసం ఉంటున్నారు. అతడు అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 26న ఆదమ్మ ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆమె మానసిక వైకల్యంతో బాధపడుతున్నట్లు సమాచారం. కేసును దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కౌన్సిలింగ్



రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కౌన్సిల్ సభ్యులు రవి, సీఐ జోసెఫ్

నాగోలు: మద్యం తాగి వాహనాలు నడపడం తమ కుటుంబంతో పాటు ఇతరులు కూడా తీవ్ర ఇబ్బందులు పడతారని రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు సీహెచ్ రవి అన్నారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 34 మంది నిందితులకు వారి కుటుంబసభ్యుల సమక్షంలో శుక్రవారం రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ జోసెఫ్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని ట్రాఫిక్ చిల్డ్రన్ పార్కులో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు రవి మాట్లాడుతూ.. మద్యం మత్తులో వాహనాలు నడపడంతోనే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. న్యాయపరంగా ఇబ్బందులు తలెత్తితే తమ సంస్థను సంప్రదించవచ్చని, బాధితులకు చట్టపరంగా న్యాయసలహాలు అందజేస్తామన్నారు. తమ కుటుంబ సభ్యులనే కాకుండా ఇతరులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టొద్దని సూచించారు. టీటీఐ ఎస్సై మనోహర్, ఎస్ఓపీ అలూరయ్య, సిబ్బంది రమేష్ తదితరులున్నారు.

జిల్లా కోర్టులో కేలండర్, డైరీ ఆవిష్కరణ

రంగారెడ్డి కోర్టులు: జిల్లా కోర్టులో తెలంగాణ న్యాయవాదుల పరస్పర సహకార సంఘం సంచాలకుడు బాచిరెడ్డి శాయిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి. పట్టాభిరమారావు సంఘం రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. తెలంగాణ న్యాయవాదుల పరస్పర సహకార సంఘం న్యాయవాదులకు చేస్తున్న సేవలను కొనియాడుతూ.. ముమ్ముందు వారి సేవలను విస్తరించాలని కోరారు. ఈ కార్యక్రమానికి సొసైటీ అధ్యక్షుడు అనిల్, కార్యదర్శి పాలిశెట్టి రవి, సంచాలకులు రాజీవ్‌రెడ్డి, న్యాయవాదుల మండలి సభ్యులు ఫణీంద్ర భార్గవ్ పాల్గొన్నారు. తదుపరి రంగారెడ్డిజిల్లా కోర్టు న్యాయవాద సంఘం అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల మాధవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో న్యాయవాదులు డైరీలను ఆవిష్కరించారు. సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, సంయుక్త కార్యదర్శి రాంచందర్ తదితరులున్నారు.

కేలండర్ ఆవిష్కరణ

నాగోలు: విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ నాగోల్ బ్రాంచ్‌లో 2024 బ్యాంకు కేలండర్‌ను బ్రాంచ్ మేనేజర్ సంజయ్‌కుమార్ పాండే ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా బ్యాంకు డైరెక్టర్లు సత్యనారాయణ, నారాయణ స్వామి, జోనల్ మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాన్యుడి సేవలో 108 ఏళ్ల చరిత్ర కలిగిన విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు సహకార స్ఫూర్తితో బ్యాంకు సభ్యుల సహకారంతో ముందుకు నడుస్తుందన్నారు. నాగోలు శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యులు గోవిందరావు, వెంకట రామకృష్ణమూర్తి, కృష్ణ, వెంకట నాగలక్ష్మి, సుధాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులున్నారు.

పదవీవిరమణ సత్కార సభ

మన్సూరాబాద్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ)లో గత 32 ఏళ్లుగా విధులు నిర్వహించి ఈనెల పదవీవిరమణ చేస్తున్న మధుసూధన్ రావు పదవీవిరమణ సత్కార సభ జీఎస్ఐలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్ కాబిరాజ్ సేథ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. జీఎస్ఐ రిక్రియేషన్ క్లబ్‌తో ఎన్నో నాటికలు ప్రదర్శించి ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని నింపారన్నారు. జీఎస్ఐలో ఉద్యోగిగా, నటుడిగా సేవలు అందించారని పేర్కొన్నారు. జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నేతలు రాజశేఖర్, సునీల్‌కుమార్, జానకీరావు, మల్లేష్, రవీందర్, జయమ్మ, అంజలి తదితరులున్నారు.

హ్యాండ్లూమ్ మేళాకు విశేష స్పందన



వనస్థలిపురం మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: హుడా ఓపెన్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకులు తెలిపారు. మేళాలో కొలువైన దుస్తులు, ఇతర సామగ్రి కొనుగోలుకు వనస్థలిపురం, పరిసర కాలనీల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, గాజులు, బ్యాగులు, హైదరాబాద్ ముత్యాలు తదితర ఉత్పత్తులను సంక్రాంతి పండుగ సందర్భంగా తగ్గింపు ధరలకు విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు. ఈ అవకాశం కొద్దిరోజులు మాత్రమే ఉంటుందని వివరించారు.

గ్యాస్ ఏజెన్సీ ఎదుట ఆందోళన

- ఏజెన్సీ మూసివేతపై వినియోగదారుల ఆగ్రహం
- కేవైసీ పూర్తిచేయాలని డిమాండ్
- నేడు యథాతథంగా పనిచేస్తుందని ప్రకటించిన నిర్వాహకులు



ఆందోళన చేస్తున్న వినియోగదారులు

మన్సూరాబాద్: సోషల్ మీడియాలో వస్తున్న కథనాలతో గ్యాస్ ఏజెన్సీల ఎదుట కేవైసీకి ప్రజలు బారులు తీరుతున్నారు. మన్సూరాబాద్ డివిజన్ ఇందిరానగర్‌కాలనీలో భారత్ గ్యాస్ ఏజెన్సీ ఎదుట శుక్రవారం కేవైసీ చేయించుకునేందుకు వస్తే ఏజెన్సీ నిర్వాహకులు అర్ధాంతరంగా మూసివేయటంతో వినియోగదారులు ఏజెన్సీ వద్ద ఆందోళన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న గ్యాస్ సబ్సిడీ సిలిండర్ రూ.500 పథకానికి కేవైసీ చేయించాలని సోషల్ మిడియాలో కథనాలు వస్తుండటంతో గ్యాస్ ఏజెన్సీల ఎదుట వినియోగదారులు బారులు తీరుతున్నారు. కేవైసీ చేయించుకుంటేనే పథకం వర్తిస్తుందన్న వదంతులతో ప్రజలు ఏజెన్సీల ఎదుట బారులు తీరారు.

ముందస్తు సమాచారం లేకుండానే..

ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఏజెన్సీని మూసివేశారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజన విరామ సమయం అనుకుని క్యూలైన్‌లోనే ఉన్నామని వినియోగదారులు వాపోయారు. సాయంత్రం 4 గంటల సమయం దాటిన ఏజెన్సీ తెరవకపోవడంతో వినియోగదారులు ఏజెన్సీ ఎదుట ఆందోళన చేపట్టారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సర్వర్‌డౌన్ కావడంతోనే మూసివేశాం..

మధ్యాహ్న సమయంలో సర్వర్‌డౌన్ కావడంతో వినియోగదారుల ఒత్తిడి తట్టుకోలేకే ఏజెన్సీని మూసివేశామని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు కైవైసీ చేపట్టామని, అకస్మాత్తుగా సర్వర్‌డౌన్ అయ్యిందన్నారు. దీనిపై వినియోగదారులకు వివరించిన వినిపించుకోకుండా వాగ్వివాదంతో కార్యాలయంలోకి చొచ్చుకొచ్చేందుకు యత్నించారన్నారు. దీంతో ఏజెన్సీని మూసివేయాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. శనివారం ఉదయం యథాతథంగా ఏజెన్సీ కార్యాలయం పనిచేస్తుందని వివరణ ఇచ్చారు.